# రోళ్ల వాగును నిర్లక్ష్యం చేసింది కాంగ్రెస్సే

- ఆ పార్టీ ప్రాజెక్టును ఓట్ల కోసమే వాడుకుంది
- బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే అద్భుతంగా తీర్చిదిద్దాం
- జగిత్యాల నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్
- బీఆర్ఎస్ బూత్ కమిటీ సమావేశం
- హాజరైన ఎమ్మెల్సీ ఎల్ రమణ, మాజీ మంత్రి రాజేశం గౌడ్, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్



సారంగాపూర్: బీర్‌పూర్ మండలంలోని తుంగూర్‌లో సమావేశంలో మాట్లాడతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

సారంగాపూర్, నవంబర్ 1: కాంగ్రెస్ నాయకులు ఓట్ల కోసమే రోళ్లవాగును వాడుకుందని, ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసిందని జగిత్యాల నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ విమర్శించారు. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం రెండు గుట్టలను కలుపుతూ రోళ్ల వాగును అద్భుతంగా అభివృద్ధి చేసిందని, త్వరలోనే ప్రాజెక్టును పూర్తి చేస్తామని పేర్కొన్నారు. బీర్‌పూర్ మండల బూత్ కమిటీ సమావేశాన్ని మండలకేంద్రంలో బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ ఎల్ రమణ, మాజీ మంత్రి రాజేశంగౌడ్, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రెండు గుట్టలను కలుపుతూ కోట్ల వ్యయంతో రోళ్ల వాగు ప్రాజెక్టును దాదాపుగా పూర్తి చేశామని, గేట్లు కట్టేది అటవీ స్థలంలో కావడంతో కొంత ఆలస్యమైందని, పెగడపెల్లిలో ఉన్న గుట్ట భూములను అటవీ శాఖకు అప్పగించేందుకు కాంగ్రెస్ నాయకులు అడ్డుపడుతున్నారని, సమస్యను త్వరలో పరిష్కరించి రోళ్ల వాగును పూర్తి చేస్తామన్నారు. ఎన్నికలు రావడం వల్ల ప్రక్రియ ఆగిందని, త్వరలోనే పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. 2004 నుంచి 2014 వరకు పది సంవత్సరాలు రాష్ట్రం, కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉందని, కానీ ఎర్రచెరువు, కొల్వాయి చెరువు, బీర్‌పూర్ చెరువు, తాళ్లధర్మారంలోని అరగుండాలలో తట్టెడు మట్టి తీయలేదని, ఏ కట్టను బాగు చేయలేదన్నారు. నర్సింహులపల్లె నుంచి కొల్వాయికి నీళ్లు పోవాలంటే రూ.10 వేలతో ఖర్చుపెట్టి ఎక్స్‌కవేటర్‌తో ఫొటోలు దిగి ఫోజులిచ్చారని, కానీ బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రూ. 1.30 కోట్లతో నర్సింహులపల్లె నుంచి కొల్వాయికి నీరు వెళ్లేందుకు కొత్త పైప్‌లైన్‌ను వేశామన్నారు. చాప చెరువుకు తూము ఏర్పాటు చేసి చెరువును నింపాలనే ఆలోచన ఎందుకు రాలేదని ప్రశ్నించారు. బీర్‌పూర్ చెరువుకు ఇటీవలే ఎమ్మెల్సీ ఎల్ రమణ రూ.20లక్షల నిధులతో చెరువును అభివృద్ధి చేసి నీటితో నింపామన్నారు. జీవన్‌రెడ్డి కూడా ఎమ్మెల్సీనే కదా.. మరి ఆయనెందుకు నిధులు కేటాయించలేదని ప్రశ్నించారు. జీవన్‌రెడ్డి ఎమ్మెల్సీ నిధులు ఏడ పోయాయో చెప్పాలని డిమాండ్ చేశారు. ఒక్క తుంగూర్ గ్రామంలోనే తొమ్మిదిన్నరేండ్లలో రూ. 22 కోట్ల ఆసరా పెన్షన్‌ను అందించామని, కాంగ్రెస్ నాయకులు దీనికి సమాధానం చెప్పాలన్నారు. కాంగ్రెస్ పాలనలో బీడీ కార్మికులకు, ఒంటరి మహిళలకు ఎందుకు పింఛన్ ఇయ్యలేదో చెప్పాలని అన్నారు. జాతీయ రహదారిపై అనంతారం వద్దలో లెవల్ బ్రిడ్జితో ప్రతి సంవత్సరం ఇబ్బందులు ఎదురవుతున్నప్పటికీ ఎంపీగా గెలిచిన అరవింద్ ఇటువైపు కన్నెత్తి కూడా చూడడంలేదని విమర్శించారు. ఎంపీగా గెలిచిన అరవింద్ ఒక్కసారైనా మండలానికి వచ్చాడా అని ప్రశ్నించారు. ఎంపీగా ఉన్నప్పుడు కవిత నియోజకవర్గంలో అందుబాటులో ఉంటూ పర్యటిస్తూ ఎంతో అభివృద్ధి చేశారన్నారు. జగిత్యాల నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ ఎల్ రమణ మాట్లాడుతూ, సమర్థత ఉన్న నాయకుడిని గెలిపిస్తేనే జగిత్యాల నియోజకవర్గం మరింత అభివృద్ధి జరుగుతుందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా బూత్ లెవల్, వార్డు లెవల్ కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని దిశానిర్దేశం చేశారు. ఎన్నికల వేళ ప్రజలు ఆగం కావద్దని, ఆలోచించి ఓటు వేయాలని కోరారు. ఎన్నికల ఇన్‌చార్జి, మాజీ మంత్రి రాజేశం గౌడ్ మాట్లాడుతూ, తాను మంత్రిగా ఉన్నప్పుడు ఈ ప్రాంత అభివృద్ధికి ఎంతో కృషి చేశామన్నారు. బీఆర్ఎస్ గెలుపునకు కృషి చేయాలని అన్నారు. రోళ్లవాగు ప్రాజెక్ట్ నిర్మాణానికి డాక్టర్ సంజయ్ కుమార్ ఎంతో కృషి చేశారని అన్నారు. సీఎం కేసీఆర్, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, మంత్రి కొప్పుల ఈశ్వర్ సహకారంతో ప్రాజెక్ట్ ఆధునీకరణకు కృషి చేశారని కొనియాడారు. జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతిపక్షాల గ్యారంటీ పథకాలకు గ్యారంటీ సీఎం లేరని విమర్శించారు. మ్యానిఫెస్టోలో ప్రకటించిన కేసీఆర్ బీమా పథకం పేద, బడుగు బలహీన వర్గాలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌కు మద్దతుగా నిలిచి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. గ్రంథాలయాల సంస్థ చైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్ గౌడ్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అయినప్పటి నుంచి ఇప్పటి వరకు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలు మీ కండ్ల ముందే ఉన్నాయని అన్నారు. ఈ సందర్భంగా బూత్ లెవల్ కమిటీ సభ్యులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో జిల్లా కేడీసీసీబీ డైరెక్టర్ ముప్పాల రాంచందర్ రావు, రైతు బంధు సమితి జిల్లా సభ్యుడు కొల్ముల రమణ, పార్టీ మండలాధ్యక్షుడు నారాపాక రమేశ్, ప్రధాన కార్యదర్శి శీలం రమేశ్, ఉపాధ్యక్షులు రామకిష్టు గంగాధర్, శ్రీనివాస్ రావు, యూత్ అధ్యక్షుడు గాజర్ల రాంచంద్రం గౌడ్, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, బీఆర్ఎస్ అనుబంధ కమిటీల సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశానికి హజరైన బూత్ లెవల్, వార్డ్ లెవల్ కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు

## ఉద్యోగులు నిర్భయంగా విధులు నిర్వర్తించాలి

### జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల, నవంబర్ 1: ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం ఉద్యోగులు నిర్భయంగా విధులు నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. బుధవారం సమీకృత కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మాడల్ కోడ్, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, వీవీటీ, వీఎస్టీ సహాయ ఖర్చుల టీమ్‌లకు శిక్షణ తరగతి నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల విధులను నిర్భయంగా, పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఎన్నికల సమయంలో ఉద్యోగులు ఎన్నికల కమిషన్ పరిధిలో పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. నిర్ణీత సమయానికి నివేదికలు సమర్పించాలని పేర్కొన్నారు. ప్రతీ టీమ్ అప్రమత్తంగా ఉండాలని, ప్రతి అం శాన్ని వీడియోగ్రఫీ చేయాలని, నగదు, మద్యం రవాణా జరుగుతున్న దృష్ట్యా బార్డర్ చెక్ పోస్టుల వద్ద వాహనాల కదలికలను పరిశీలించి తనిఖీలు నిర్వహించాలని సూచించారు. అనధికారికంగా రూ. 50 వేల నగదు కన్నా ఎక్కువ ఉంటే సీజ్ చేయాలని, ఆధారాలు లేని నగదు రూ.10లక్షల కంటే ఎక్కువ ఉంటే ఇన్‌కం టాక్స్ అధికారులకు తెలియజేయాలన్నారు. తనిఖీల్లో భాగంగా సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా విధులు నిర్వహించాలన్నారు. పోటీ చే సే అభ్యర్థి ఖర్చు రూ.40 లక్షలు మించకూడద ని, ఎక్కువ ఖర్చు అయితే డిస్ క్వాలీఫై అవుతారని తెలిపారు. ప్రతీ అభ్యర్థికి షాడో రిజిస్టర్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. వివిధ పా ర్టీల వారు కరపత్రాలను పంపిణీ చేస్తున్నారని, వాటిపై ప్రింటర్, పబ్లిషర్, ప్రతుల సంఖ్య వంటివి ప్రచురించడం లేదని దృష్టికి వచ్చిందని, అలాంటి వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుం టామని తెలిపారు. అంతకుముందు రాజన్న సిరిసిల్ల జిల్లా ఆడిట్ అధికారిణి స్వప్న మాట్లాడుతూ, ప్రతీ టీమ్ నివేదికలు సక్రమంగా నిర్వహించేలా చూడాలని, రోజువారీ ఖర్చుల నివేదికలు క్రోడీకరించి పూర్తి సమాచారాన్ని ఎన్నికల కమిషన్‌కు సమర్పించాలని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత, మా స్టర్ శిక్షకులు తిరుపతి, సుధీర్, డిప్యూటీ సీఈవో రఘువరన్, జిల్లా ఆడిట్ అధికారిణి సుజాత, జిల్లా పౌర సంబంధాల అధికారి ఎన్ భీమ్‌కుమార్, వివిధ టీమ్‌ల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్ అమలు: ఎస్పీ

జగిత్యాల కలెక్టరేట్, నవంబర్ 1: జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు బుధవారం నుంచి 30వ తేదీ వరకు పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్ అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని తెలిపారు. శాంతిభద్రతలకు భంగం కలిగించేలా ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించేలా చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు.

## న్యాయవాదుల వేదిక అధ్యక్షుడిగా మహేందర్

జగిత్యాల, నవంబర్ 1: సామాజిక న్యాయం కోసం న్యాయవాదుల వేదిక అధ్యక్ష, కార్యదర్శులుగా వడ్లకొండ మహేందర్, అల్లె పురుషోత్తం ఎన్నికయ్యారు. బుధవారం జిల్లాకేంద్రంలో న్యాయవాదులు సమావేశమయ్యారు. ఇందులో 'సామాజిక న్యాయానికై న్యాయవాదుల వేదిక' ఏర్పాటు కాగా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారని ఎన్నికల అధికారి నక్కల సంజీవరెడ్డి తెలిపారు. ఉపాధ్యక్షులుగా రాగం రమేశ్, నిర్వహణ కార్యదర్శిగా తిట్ల అరుణ్, కోశాధికారిగా గణేశ్, కార్యవర్గ సభ్యులుగా కొలిపాక కరుణాకర్, గుగ్గిళ్ల రాజేందర్, భూస విశ్వదత్తు, దూలూరి సాయి, మధును ఎన్నుకున్నారని ఎన్నికల అధికారి తెలిపారు. ఈ వేదిక ఏర్పాటుపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

## కొనుగోలు కేంద్రాల సిబ్బందికి శిక్షణ

జగిత్యాల రూరల్, నవంబర్ 1: మండల సెర్ప్ కార్యాలయంలో జగిత్యాల రూరల్, అర్బన్ మండలాల ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బంది, కమిటీ సభ్యులకు ట్యాబ్ ఎంట్రీపై జిల్లా సెర్ప్ మార్కెటింగ్ అధికారి జేడీ మల్లేశం బుధవారం శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆన్‌లైన్‌లో నమోదు చేయడం వల్ల ధాన్యం వివరాలు కనిపించే అవకాశం ఉందన్నారు. నిబంధనల ప్రకారం తూకం వేయాలని ఆదేశించారు. అలాగే ఎన్నికల్లో ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటింగ్‌లో పాల్గొనేలా గ్రామైక్య సంఘాలు, సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఏపీఎం గంగాధర్, జిల్లా సివిల్ సప్లయ్ టెక్నీషియన్ కల్యాణ్, మండల సమైఖ్య అధ్యక్షురాలు ఎం సత్తవ్వ, సీసీలు గంగారాం, విద్యాసాగర్, మరియా, మంగ, కొనుగోలు కేంద్రాల సిబ్బంది, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌లో చేరికల జోరు

బార్ అసోసియేషన్‌కు చెందిన పలువురు సీనియర్ న్యాయవాదులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్



పార్టీలో చేరిన న్యాయవాదులతో ఎమ్మెల్యే సంజయ్ కుమార్, ఎమ్మెల్సీ రమణ

జగిత్యాల కలెక్టరేట్, నవంబర్ 1: జగిత్యాల బార్ అసోసియేషన్‌కు చెందిన పలువురు సీనియర్ న్యాయవాదులు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ ఎల్ రమణ సమక్షంలో బుధవారం బీఆర్ఎస్‌లో చేరారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్, నియోజవర్గంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్శితులైన సీనియర్ న్యాయవాది, టీడీపీ సీనియర్ నాయకుడు ఎర్ర నర్సయ్య, సీనియర్ న్యాయవాదులు పులిశెట్టి శ్రీనివాస్, పాండురంగ విఠల్, అనుమల్ల భుజంగం, శశిధర్ మోతె రోడ్డులోని పార్టీ కార్యాలయంలో బుధవారం బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ ఎల్ రమణ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ పట్టణాధ్యక్షుడు గట్టు సతీశ్, సీనియర్ న్యాయవాదులు జగిత్యాల బార్ అసోసియేషన్ సెక్రటరీ చీటి రామకృష్ణారావు, పొతంశెట్టి సతీశ్‌రాజ్, శ్రీపాల్‌రెడ్డి, బూసారపు శ్రీనివాస్ గౌడ్, రామిడి జగన్, చింత శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు తొలిప్రేమ శ్రీనివాస్, భిక్షపతి, కిశోర్, మహేశ్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

### బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు

రాయికల్, నవంబర్ 1: భూపతిపూర్ గ్రామానికి చెందిన 70 మంది బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులతో పాటు పలు కుల సంఘాల నాయకులు బుధవారం బీఆర్ఎస్ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షులు కోల శ్రీనివాస్, సర్పంచ్ జక్కుల చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ మహేశ్వరరావు, గ్రామ శాఖాధ్యక్షుడు దేవేందర్, ఎంపీటీసీ ఫోరం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, నాయకులు గోపాలకృష్ణ, హరీశ్, తిరుపతి, రమేశ్, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### బాధిత కుటుంబాలకు పరామర్శ

రాయికల్, నవంబర్ 1: తాట్లవాయి గ్రామ మాజీ ఎంపీటీసీ పాలెపు సాయిలు బుధవారం అనారోగ్యంతో మరణించగా పార్థివదేహం వద్ద ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అలాగే అల్లీపూర్ గ్రామానికి చెందిన లోకేని ప్రభాకర్ అనారోగ్యంతో బాధపడుతుండగా ప్రభాకర్‌ను ఎమ్మెల్యే పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మండల, గ్రామ నాయకులు తదితరులున్నారు.